క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక సీఎంటీ రోడ్డు లోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. జాబ్‌మేళాకు 10 కంపెనీలు హాజరవుతాయన్నారు. డిగ్రీలో బీ.కాం, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: మే 18న గుండె పోటుతో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం కుటుంబానికి ఎస్పీ రిశాంత్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆర్థికసాయం అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ భార్య విజయలక్ష్మికి కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును అందజేశారు. అలాగే శాఖాపరంగా కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

ఆశా వర్కర్లకు శిక్షణ

చిత్తూరు రూరల్: చిత్తూరులోని టీటీడీసీలో బుధవారం ఆశా వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా నియమితులైన 90 మందికి విధులు, బాధ్యతలు, విధి విధానాలపై డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి, డీఐఓ రవిరాజు వివరించారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవలను మరింత విస్తృతం చేయడానికి కృషి చేయాలని మార్గదర్శనం చేశారు. గర్భవతుల గుర్తించి కాన్పు అయ్యే వరకు క్రమం తప్పకుండా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. హైరిస్క్ కేసులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ప్రధానంగా మాతా–శిశు మరణాలను తగ్గించడానికి కృషి చేయాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేటలోని ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడతగా వివిధ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబమూర్తి తెలిపారు. కోపా, మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటర్ వెహికల్, డీమెన్ సివిల్ కోర్సులు ఉన్నాయని, ఇందుకు 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు జూన్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభినందన


ఉద్యోగులకు నగదు బహుమతి ఇస్తున్న డీఎం

చిత్తూరు రూరల్: చిత్తూరు–1 డిపోలో ఆదర్శ ఉద్యోగులకు బుధవారం ఆర్టీసీ అధికారులు అభినందన సభ నిర్వహించారు. ఈశ్వరి, విజయశేఖర్‌రెడ్డి, శేఖర్, వీపీ రెడ్డి, కేఆర్ నాయుడు, సుబ్రమణ్యంకు డిపో మేనేజర్ క్రిష్ణమూర్తి నగదు బహుమతిని అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ఆర్టీసీ సేవలను, లక్ష్యాలను అధిగమించేలా చూడాలని ఆయన కోరారు.

ఘర్షణ ఘటనలో ఇద్దరిపై కేసు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని బజారువీధిలో నడిరోడ్డుపై ఘర్షణకు దిగి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసిన కేసులో ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేశారు. బజారువీధిలో నగల పాలిష్ దుకాణాలు నిర్వహించే ఇద్దరు వ్యాపారులు రెండు గ్రూపులుగా విడిపోయి మంగళవారం మధ్యాహ్నం రోడ్డుపైనే బాహాబాహీకి దిగడం విదితమే. దీనిపై పాలిష్ దుకాణాలు నిర్వహిస్తున్న సౌందర్, కెఆర్.మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట పంచాయతీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జెడ్పీ సీఈఓ. ప్రభాకర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో నూతన భవన నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను టీచర్లను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. 11 రకాల సేవల గురించి గ్రామంలోని ప్రజలకు వలంటీర్లు క్లుప్తంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మజారాణి, పంచాయతీ కార్యదర్శి జరీనా, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ పరిశీలించిన డీఆర్ఎం



చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్ గుంతకల్లు డీఆర్ఎం వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. బుకింగ్ కౌంటర్, ప్లాట్‌ఫాం, వెయిటింగ్ హాల్, టాయిలెట్స్, విచారణ విభాగాన్ని పరిశీలించారు. స్టేషన్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం బొమ్మసముద్రం స్టేషన్ పరిశీలించి, కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామి, వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హర్షం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. పీఆర్‌సీ సమస్యలను తెలుసుకునేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మన్మోహన్‌ను కమిషన్ చైర్మన్‌గా ప్రకటించడం శుభపరిణామన్నారు.

పవన్ దిష్టిబొమ్మ దహనం

- కొనసాగుతున్న నిరసనలు
- బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వలంటీర్ల డిమాండ్


ఐరాలలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్ల మానవహారం

గుడిపాల: వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్ల లోకం భగ్గుమంటోంది. బుధవారం మండలంలోని వసంతాపురం వద్ద వలంటీర్లు పవన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి మరీ దహనం చేశారు. వారు మాట్లాడుతూ, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వలంటీర్ వ్యవస్థను పవన్ కళ్యాణ్ టార్గెట్ చేయడం దారుణమని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమపై విషం చిమ్మడం, వలంటీర్లు సేకరిస్తున్న డేటా మూలాన మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారంటూ ఆయన ఆరోపించడం ఎంతమాత్రమూ తగదని ఖండించారు. చంద్రబాబు డైరెక్షన్‌లో ప్రభుత్వంపై, తమపై బురద చల్లుతున్న ఆయనకు కూడా ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. ఆయనపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు శేషమ్మ, జ్ఞానేశ్వరి, సంధ్య, రేణుకుమార్, రమేష్, రాజేష్, వెంకటేష్, మనోహర్, బాబు, రోహిత్ యాదవ్ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు మతిపోయింది

కాణిపాకం(యాదమరి): జనసేన అధినేత పవన్ కల్యాన్‌కు మతిపోయినట్లు ఉందని, అందుకే అతను ఏమి మాట్లాడుతున్నాడో అతనికే అర్థం కావడం లేదని స్త్రీశిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజ చరణ్ రెడ్డి అన్నారు. ఆమె బుధవారం కాణిపాకంలో విలేకరులతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ జనసేన అనే పార్టీ పెట్టుకుని వారాహి పేరుతో నారాహి యాత్ర చేస్తున్నాడని విమర్శించారు. యాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నివిధాలా సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో పవన్ కల్యాణ్ ఏమి మాట్లాడాలో అర్థకాక వలంటీర్లపై దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు.


మాట్లాడుతున్న శైలజ చరణ్ రెడ్డి

తక్షణం పవన్ క్షమాపణ చెప్పాలి

ఐరాల: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. బుధవారం వారు మండలకేంద్రం ఐరాలలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు బజారువీధిలో మానవహారంగా ఏర్పడి పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం పవన్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించామని గుర్తు చేశారు. తమకు బహిరంగా క్షమాపణ చెప్పే వరకు ఆందోళన ఆపేది లేదని స్పష్టం చేశారు.


గుడిపాల: వసంతాపురం వద్ద పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

గడప గడపలో సంక్షేమ వెలుగులు


తగ్గువారిపల్లి ఇందిరమ్మ కాలనీలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: నవరత్న పథకాలతో ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు చిమ్ముతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని తగ్గువారిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, అందారెడ్డిపల్లె, దళితవాడ, ఆదిఆంధ్రవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఆయా కుటుంబాల లబ్ధిదారులు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో తెలియజేశారు. పథకాలు అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ఇళ్ల స్థలాలు, ఫించన్లు, కొత్తరేషన్ కార్డులు మంజూరు చేయాలని, సిమెంట్ రోడ్లు వేయించాలని, మురుగు కాలువలు నిర్మించాలని, శ్మశాన స్థలాన్ని మంజూరు చేయాలని, ఇందిరమ్మ కాలనీలో ఆలయ నిర్మాణానికి తోడ్పాటునివ్వాలని స్థానికులు కోరారు. అనంతరం సర్పంచ్ వాణిప్రియ సహకారంతో వికలాంగులకు వాకర్ స్టిక్స్, వాకర్ అందజేశారు.

మాతమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మండలంలోని అందారెడ్డిపల్లె ఆది ఆంధ్రవాడలోని మాతమ్మ ఆలయంలో ఎమ్మెల్యే బాబు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో మళ్లీ సీఎం కావాలని పూజలు చేశారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన అనంతరం గ్రామ సచివాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో ఎమ్మెల్యే సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తులసీ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఫిరోజ్ అహ్మద్, ఎంపీటీసీ సభ్యులు షబీనా, హేమచంద్ర, ఈడిగ, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు ఎల్లప్ప, మొగిలీశ్వర, ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్, జిల్లా బీసీ నాయకులు దొరస్వామి, సురేంద్ర, జిల్లా పార్టీ కార్యదర్శులు శరత్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదాయత్, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు బంగారుపాళెం–1లో..

గురువారం ఉదయం 6.30 గంటల నుంచి బంగారుపాళెం గ్రామ సచివాలయం–1 పరిధిలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

వయో పరిమితి పెంపుపై హర్షం

దేవదాయశాఖలో వందమందికి ప్రయోజనం

చిత్తూరు రూరల్: దేవదాయ శాఖలో ఉద్యోగుల పదవీ విరమణ వయో పరిమితి పెంపుపై రాష్ట్ర మంత్రి వర్గంలో తీసుకున్న కీలక నిర్ణయంపై హర్షం వ్యక్తం అయ్యింది. ప్రస్తుతం 60 ఏళ్లకు ఉన్న పదవీ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో జిల్లాలో పనిచేస్తున్న వంద మంది సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది. కార్యనిర్వహణ అధికారి, ఆలయ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ హోదాల్లో జిల్లాలో వంద మందికిపైగా సిబ్బంది ఉన్నారు.

అర్చకులు రెండు వేల మందికి పైనే

అర్చకులకు పదవీ విరమణ లేకుండా నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని అర్చకులకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో 6(ఏ) కేటగిరిలో ఆరు ఆలయాలు, 6(బీ) కేటగిరిలో 54 ఆలయాలు, 6(సీ) కేటగిరిలో 1,200 ఆలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో రెండు వేల మంది అర్చకులు ఉన్నారు. ప్రభుత్వం నిర్ణయంపై అర్చకులు, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

డెయిరీ ఎదుట నిరసన

చిత్తూరు కార్పొరేషన్: చరిత్ర కలిగిన విజయా డెయిరీని అమూల్ సంస్థకు లీజు ఇవ్వడం సరికాదని సీపీఐ, రైతు సంఘ నాయకులు బుధవారం స్థానిక అమూల్ డెయిరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగదీష్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి మాట్లాడారు. ప్రైవేటు సంస్థకు నామ మాత్రపు ధరకు విజయా డెయిరీని లీజుకు ఇవ్వడం సరి కాదన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, రైతు సంఘం నాయకులు మునిరత్నంనాయుడు నాయకులు మణి, విజయగౌరి పాల్గొన్నారు.

నీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో నగరంలో నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నగర కమిషనర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరం 28వ వార్డు పరిధిలోని ప్రాంతాల్లో బుధవారం ఆమె తాగునీటి సరఫరా తీరు, క్లోరినేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఓ ఇంటి వద్ద సీఎస్ఆర్ ట్యాంక్ నుంచి సరఫరా అయ్యే నీటికి క్లోరిన్ పరీక్ష చేసి పరిశీలించారు. నీటి సరఫరా సక్రమంగా అవుతోందా? సరిపోయేంత నీరు వస్తుందా? సమాచారం ఇస్తున్నారా? అని స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. అక్కడి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. అనంతరం సీఎస్ఆర్ ట్యాంక్ నీటికి క్లోరిన్ పరీక్ష నిర్వహించి పరిశీలించారు. లాగ్ పుస్తకాలను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, ప్రధానంగా పైపులైన్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్న అన్ని ప్రాంతాల్లో క్రమం తప్పకుండా క్లోరిన్ పరీక్షలు చేయాలని. నీరు, పారిశుధ్య సమస్యల కారణంగా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట ప్రసాద్, డీఈ రమణ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ మృతి


పూర్ణచంద్ర(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం గ్రామానికి చెందిన సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ పూర్ణచంద్ర బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన కొన్ని రోజులుగా బెంగళూరులో చికిత్స పొందుతూ రెండు రోజుల కిందటే స్వగ్రామానికి వచ్చాడు. ఉన్న ఫలంగా ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

ఫీవర్ సర్వేపై అవగాహన

యాదమరి: వైద్యసిబ్బంది గ్రామాల్లో 15 రోజులకు ఒకసారి జ్వరాలపై సర్వే చేయాలని యాదమరి పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. బుధవారం యాదమరి సంతగేటు ప్రభుత్వాస్పత్రిలో ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు సంయుక్తంగా ప్రతి గడపకు వెళ్లి జ్వరాలపై సర్వే చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. అలాగే జ్వరాల బారిన ఉన్న గ్రామీణ ప్రజలకు గుర్తిస్తే వారి గురించి వైద్యాధికారికి సమాచారం అందించాలన్నారు. అలాగే హెల్త్ యాప్‌లో జ్వరాలు ఉన్నవారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విజేతగా మద్దులయ్యగారిపల్లి జట్టు


విజేత జట్టుతో నాయకులు, అధికారులు

పూతలపట్టు: మండలంలోని మద్దులయ్యగారిపల్లె మైదానంలో బుధవారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా మద్దులయ్యగారిపల్లి జట్టు నిలిచింది. వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయుడు, ఢిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో మద్దులయ్యగారిపల్లె జట్టు విజేతగా నిలవగా, పాలకూరు జట్టు రన్నర్‌గా నిలిచారు. విజేత జట్టుకు మొదటి బహుమతిగా రూ.16,666, రన్నర్ జట్టుకు రూ.7,777 నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, బాలాజీ, మణి, నందకుమార్, షణ్ముగం, రవినాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల యోగక్షేమాలే ముఖ్యం


నూతన డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్టలో ఉన్న అమర్‌రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగుల యోగక్షేమాలు ముఖ్యమని ఆ సంస్థ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని పేటమిట్టలో ఉద్యోగులకు నూతన డిస్పెన్సరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐసీ ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కలిసి డిస్పెన్సరీలో వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ జయకృష్ణ, చీఫ్ ఆఫీసర్ నరసింహులు నాయుడు, జనరల్ మేనేజర్ నళినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం

చిత్తూరు రూరల్: జిల్లా సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దం పట్టే జానపద కళారూపాలను కాపాడుకుందామని జానపద వృత్తి కళాకారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మురళి పిలుపునిచ్చారు. చిత్తూరులోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వీధి నాటకాలు, భాగవతం, హరికథ, బుర్రకథ, కోలాటం..ఇత్యాది వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారులను ప్రోత్సహించాలని, వారికి ప్రభుత్వం తరపున గుర్తింపు కార్డు, పింఛన్, కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో జిల్లా కళాకారులకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేయాలన్నారు. దీనిపై త్వరలో కలెక్టర్‌ను కలిసి వినతి ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు రామచంద్రన్, రవికుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన

గుడిపాల: నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి–2 గణపతి అన్నారు. బుధవారం బొమ్మసముద్రం జూనియర్ కాలేజీ, హైస్కూల్‌లో నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టాయిలెట్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల యూనిఫామ్‌లో తప్పులు ఏవైనా ఉంటే సరిచేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసంతాపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో భోజనం చేశారు.

విద్యాప్రమాణాల పెంపుపై దృష్టి

- కలెక్టర్ షణ్మోహన్

గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ బడులను ఎంతో అభివృద్ధి చేసిందని అయితే పిల్లల్లో విద్యాప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి డిజిటల్ బోధనపై టీచర్లను ఆరాతీశారు. పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన అమలును ప్రత్యక్షంగా చూశారు. అనంతరం పక్కనే ఉన్న జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. అనంతరం పత్తికొండ పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలించారు. తక్కువ బరువున్న పిల్లల విషయంలో కేర్ తీసుకోవాలని అక్కడి వర్కర్‌ను ఆదేశించారు.


పత్తికొండలో అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

తవణంపల్లె: మండలంలోని కొండ్రాజుకాలువ, వెంగంపల్లెలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కొండ్రాజుకాలువలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, వెంగంపల్లెలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 104 మొబైల్ క్లినిక్‌లో గర్భిణులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు.

బాలికలు అన్నింటా రాణించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం అమలు విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని బాలికలు అన్నింటా రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సంజయ్ గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో–భేటీ పడావో (బాలికను సంరక్షించు–బాలికను చదివించు) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఆడపిల్ల అంటే సమాజంలో చిన్నచూపు, వివక్ష ఉండకూడదన్నారు. గర్భంలో ఉన్నది ఆడశిశువు అని తెలగానే గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్న ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలు ఉన్నత చదువులు చదవాలని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సర్కారు దృష్టికి ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలు


రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులును సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయన బుధవారం స్థానిక ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంఘం బలోపేతానికి సభ్యులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్ సెల్వం నివేదించిన సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం రాష్ట్ర కమిటీ నాయకులు చిరంజీవి, నాగరాజులను దుశ్శాలువతో సన్మానించారు. సమావేశంలో జిల్లా నాయకులు షణ్ముగం, రామన్న, రోషన్‌బాషా, సురేష్‌బాబు, నాగరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా ఉపాధి పనులు చేపట్టండి


పాతపాళ్యంలో రోజా పూలతోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

ఐరాల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను సక్రమంగా, నాణ్యతగా చేపట్టాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎర్రేపల్లె, పుల్లూరు, పాతపాళ్యంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఎర్రేపల్లె సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్లను, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఎర్రేపల్లె, పుల్లూరులో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన ఫాంపాండ్, మామిడి చెట్ల పెంపకం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అదేవిధంగా ఉపాధి నిధులతో పాతపాళ్యంలో చేపట్టిన రింగ్ ట్రెంచ్, రోజా పూలతోటను పరిశీలించారు. మండలంలో మరింత ఎక్కువగా ఉపాధి పనులను చేపట్టాలని ఆమె సూచించారు. మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల కుటుంబాలకు తప్పనిసరిగా జాబ్‌కార్డు అందించి వందరోజుల పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్య, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంతర పంటలతో లాభాలు


బొమ్మాయిపల్లెలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

బంగారుపాళెం: వేరుశనగ సాగులో రైతులు అంతర పంటలు సాగుచేయడం ద్వారా లాభాలను పొందవచ్చని వ్యవసాయశాఖ స్టేట్ రిసోర్సు పర్సన్ రామచంద్రయ్య తెలిపారు. బుధవారం మండలంలోని బొమ్మాయిపల్లె, జంబువారిపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంటలను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసుతో కలసి పరిశీలించారు. బొమ్మాయిపల్లెలో వేరుశనగ కాంప్యాక్ట్ బ్లాక్‌లో (10ఎకరాలు) అంతర పంటగా 16 రకాల పంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటతో పాటుగా వివిధ రకాల అంతర పంటలను వేసుకోవడం రైతులకు లాభమని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పంటలకు రసాయన ఎరువులు, మందులకు బదులు ఘన, జీవామృతం వంటి సేంద్రియ ఎరువులు, కాషాయం వినియోగిస్తే ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు దిగువమాసపల్లెలో 'జగనన్న సురక్ష'

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం దిగువమాసపల్లె సచివాలయంలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ


సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న డీఎఫ్ఓ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి దేవర కొండపై వెలసిన శ్రీజలకంఠేశ్వరస్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు పనులకు బుధవారం భూమిపూజ చేశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయగా, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చొరవతో గోశాల నుంచి దేవరకొండపైకి సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు రేంజ్ అధికారి శివన్న, సెక్షన్ అధికారి రమేష్, సిబ్బంది, సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కామరాజు, సుబ్రమణ్యం, కుమార్ పాల్గొన్నారు.